# 31వ పుష్పము

## 31. ఓం శ్రీ సాయి - షిర్డీ సాయిమూర్తయే నమః

1) నామ పారాయణ ప్రియుడు

షిర్డీ సాయిబాబాయే, పర్తిసాయిబాబాగా అవతరించెను. షిర్డీబాబు 1918వ సంవత్సరంలో అవతారము చాలించిరి. పర్తి సత్యబాబా 1926 సంవత్సరములో అవతరించారు. చాలా మందికి యీ 8 సంవత్సరములు అవతార మూర్తి ఎక్కడ ఉన్నారు? అనే ప్రశ్న వచ్చింది. సమాధానము యోగనిద్రలో యున్నారు. స్వామి కాలాతీతులు. మానవులు కాలమునకు లోబడి యుండువారు.

కాలాయ నమః : "కలయతి సర్వమితి కాలః"

కాలః కలయతా మహం "భ.గీ॥ = గణించువారలలో నేను కాలము (10-30) (ఇతి భగవద్వచనాత్) అంతటిని నెంచువాడు విష్ణువు.

"ఏతస్యవా అక్షరస్య ప్రశాశనే గార్గి నిమేషా ముహూర్తా అహోరాత్రాణ్యర్ధమాసా మాసా ఋతవః సంవత్సరా ఇతి విధీతా స్థిష్ఠన్తే" (బృ.ఉ. 3-8-9).

ఆ అక్షర పరబ్రహ్మము సాయి పరమేశ్వరుని యొక్క ఆజ్ఞవలననే, నిమేష ముహూర్తము, అహోరాత్రము, పక్షము, మాసము, సంవత్సరము మొదలైన భేదములు గల ఆయా కాలములను తప్పకుండా కలుగుచున్నవి. అందుకనే శివుని "కాలకాలాయ నమః" అన్నారు. కాలాతీతుడు అన్నారు సాయి పరమేశ్వరుని. షిర్డీ బాబా "నేను లక్షలకొలది జనులను మంచిమార్గమున నడిపించి, గమ్యము చేర్చగలను. అది నా కర్తవ్యము" అన్నారు. అదే స్వామి చేయుచున్నారు. అట్టి స్వామికి నమస్కారము.

2) వాణీస్వరూపుడు

ప॥ ఇనుప పాత్రయైన హేమ పాత్రంబైన । నీటి తేటవలన మేటికెక్కు
మనసు మంచిదైన తనువులు మాటేమి । ఉన్నమాట చెప్పచున్న మాట॥

దివ్య ప్రకటన (Cont.) : శ్రద్ధ వున్నవారు ఇచ్చటికి చాలామంది చేరారు. ఇప్పడు సంఘములో అన్ని వర్గముల వారు ఉన్నారు. మీకు ఇప్పడు నా నిజతత్త్వము చెప్పవలసి యున్నది. ఎందుకంటే నూటికి తొంబై తొమ్మిదిమందికి తెలియదు కనుక. ఆధ్యాత్మిక విషయాలు తెలిసికోవాలన్న యాసక్తితో ఆతురుతతో వచ్చారు. నిజంగా చూస్తే మీరు నా నిజతత్త్వాన్ని అర్థం చేసుకోలేరు. ఇప్పడేకాదు. వెయ్యేండ్లు తలక్రిందులుగా తపస్సు చేసినా ఈ జగత్తులోయున్న మానవులంతా కలసి, ఎంత ప్రయత్నము చేసినా నన్ను తెలిసుకోలేరు. కొంత కాలానికి మీకు తెలుస్తుంది. ఆ దేవదేవుడు ఈ పవిత్ర శరీరాన్ని తీసుకున్నదని. ఈ పవిత్ర నామము ధరించినదని, మీరు చాలా అదృష్టవంతులు. ఇప్పడొక గొప్ప అవకాశము చిక్కినది. ఇటువంటిది యిదివరకెప్పడు, ఏ మహనీయులకు గాని, మనీశ్వరులకు గాని మరెవ్వరికిని కలుగని అవకాశము చిక్కింది. దైవాంశము ఉన్న వారికి కలుగనిది మీకు కలిగినది.

3) సకలతత్త్వ బోధకుడు - "నా" స్థానము హృదయము

ఆత్మయే హృదయం. హృదయమే ఆత్మ. రెండును వేరు వేరు కాదు. నేను అనే దానికి ఉనికిని, స్థానాన్ని కనుగొనటమే సాధన. చాలామంది తెలియని మార్గాలలో పడి, తికమకపడిపోతున్నారు. ఆధ్యాత్మిక మార్గాన్ని విస్మరిస్తున్నారు. ప్రతి భావన, ద్వైత భావంతో చేస్తున్నారు. ఎంతకాలము ద్వైతంలో వుంటే అంత కాలము వ్యర్థమైపోతుంది. క్రమేణా దృష్టిని మార్చుకోవాలి. సృష్టి కల్పనేయన్న సత్యాన్ని అర్థం చేసుకోవాలి. దృష్టి వున్నంత వరకు సృష్టి వుంటుంది. నేత్రమున్నంత వరకే శాస్త్రము శాసిస్తుంది. ఈనాడు మనము భజనలు, జపములు, పూజలు, యజ్ఞములు, యాగములు, యోగముల చేస్తున్నాము. నేను వీటికి సులభంగా లభించే వాడు కానని,

భగవద్గీత 11వ అధ్యాయములో 48 నుండి 52 వరకు గల శ్లోకాలలో స్పష్టంగా బోధింపబడియున్నది. అంటే వీటినన్నిటిని విసర్జించాలని కాదు. ద్వైత వాదములోనున్న వారికి అవసరమే. "లోకం అనిత్యం అసుఖం" అని గీత బోధించింది. అనిత్యము, అసుఖము అయిన లోకములో, నిత్యాసత్యములైన సుఖ శాంతులను ఏ రీతిగా సాధించగలము? మనలో శాశ్వతత్త్వమొకటి యున్నది. దాని ద్వారానే మనము శాశ్వతాన్ని సాధించాలి. అదే ఆత్మ తత్త్వము. చేసేది ఆత్మ, చేయించేది ఆత్మ, అనుభవించేది ఆత్మ. సర్వము ఆత్మ అనే భావము వృద్ధిపరచుకుంటే క్రమేణా అది విశాలతత్త్వానికి చేరుస్తుంది. చేరడం ఎంత కష్టమైనా లక్ష్యం మాత్రం పెట్టుకోవాలి. ఎంత కాలము దేహ భ్రాంతులతో జీవిస్తూ పోతే, అతీతమైన, రూపాతీతమైన, భావాతీతమైన, నిజతత్త్వాన్ని అనుభవించేదెన్నడు? నిజమైన ఆత్మతత్త్వం మీదనే గురిపెట్టుకోండి. పరమాత్మ మానవుడి హృదయంలోనే యున్నాడు. అదే "నా" స్థానము.

4) జ్ఞాన స్వరూపుడు - కఠోపనిషత్తు (2-2-12)

ఉ॥మం॥ ఏకోవశీ సర్వభూతాంతరాత్మ॥ ఏకం రూపం బహుదాయః
కరోతి । తమాత్మస్థం యేనుపశ్యంతి ధీరా॥ స్తేషాం సుఖం
శాశ్వతం నేతరేషా॥

తా॥ (సాయి పరమేశ్వరుడు) అసమానుడును, జగత్తును తన అధికారం క్రింద (వశమందు) కలవాడును, సర్వభూతములకు, అంతరాత్మగా నున్నవాడును అగు ఏ పరమాత్మను, ఏ ఒక్క రూపమును, అనేక నామరూప భేదములు గల దానిగా చేయుచున్నదో, అట్టి పరమాత్మను తమ హృదయమునందు వశించునటుల చూచెడి జ్ఞానులకు, శాశ్వత సుఖము గలదు.

భ.గీ॥ యతన్తో యోగినశ్చేనం । పశ్యన్త్యాత్మన్య వ్యవస్థితం : (15-11)

తా॥ జ్ఞాన పరులగు యోగులు పరమాత్మను తమలోనే దర్శింతురు. అనగా తమ హృదయము లోపలనే దర్శింతురు.

5) ప్రేమ స్వరూపుడు :

"అనిర్వచనీయం భక్తిః" భక్తి వర్ణింప సాధ్యము కానిది. లోకంలోయున్న అనేక సాధనలతో, సులభము, శ్రేష్ఠమైనది. ఇది భయముతో కూడిన సేవ. త్రిగుణాతీతమైన శక్తిని, గుణాత్మకమైన తత్త్వంతో కొలవడానికి వినయ, విధేయతలు అత్యవసరం. త్రిగుణములతో మనోవాక్కాయ కర్మలచేత, దివ్య తత్త్వాన్ని సేవించడమే భక్తి. భక్తి యనగా పూర్ణ ప్రేమ. భక్తి, ప్రేమలు అవినాభావ సంబంధములు ప్రేమ. ఒక భక్తునికి ఆపరేషను బుధవారం అని టాటా వారి ఆసుపత్రిలో నిర్ణయించారు. స్వామి అన్నారు, "ఆపరేషను బుధవారం కాదు, గురువారం జరుగుతుంది. అంతా బాగు అవుతుంది." అట్లే జ్ఞాన స్వరూపుని వాక్కు ప్రకారము జరిగింది. 1940వ సంవత్సరములో స్వామి తన అవతారాన్ని ప్రకటించారు. భక్తుల ఆహ్వానం మీద హస్పేటకు వెళ్ళి, చాలాకాలము క్షయవ్యాధిచే బాధ పడుతున్న ఒక వ్యక్తిని తన దివ్య స్పర్శచే, మంచం నుంచి లేవదీసి, ఒక మైలుదూరం నడచి వచ్చేటట్లు చేశారు. అనేక వస్తువులను సృష్టించి, భక్తులకు పంచి పెట్టారు. దివ్యశక్తి చేత చికిత్స చెయ్యడం యిదే మొదటి సారి.

6) సర్వజన ప్రియుడు - (చేతిరుమాలా ఉపదేశం) పోపీకిర్బి.

నేను 14 నెలలు ప్రశాంతి నిలయంలో వున్నాను. కేథలిక్కు క్రిష్టియను నేను, స్వామి విభూతి సృష్టించి యిచ్చిన తర్వాత ఎవరో భక్తులు చేతి రుమాలను యివ్వగా స్వామి చేతిని తుడుచుకొని రుమాలను యిచ్చేస్తారు. నాకు అటువంటి భాగ్యము ఎప్పుడు కలుగుతుందా అని అనుకునేదాన్ని. ఒక ప్లాస్టిక్ సంచీలో తెల్లటి జేబు

రుమాలను మడచి పెట్టుకొని సిద్ధంగా యుండేదానిని. ఆ శుభ ఘడియ వచ్చింది. నా ప్రక్క కూర్చున్న ఒక అమెరికా స్త్రీకి విభూతి సృష్టించి ఇచ్చారు. నా హృదయం పొంగింది. చేతిరుమాలను తీసి సిద్ధంగా యున్నాను. ప్రేమమయుడు, అంతర్యామి అయిన సాయి భగవానుడు చేయి చాపినాడు. నా రుమాలా యిచ్చాను, తీసుకు న్నారు. ఆ క్షణంలో స్వామికి సేవ చేస్తున్నానా? లేక స్వామి నాకు చేస్తున్నారా? అనే ప్రశ్న నాలో మెరిసింది. చేయి తుడుచుకుని స్వామి చేతి రుమాలను నా ఒడిలోనికి విసిరి వేసారు. అప్పడు నా ఆనందానికి అవధులు లేవు. తల్లి ప్రేమకంటె స్వామి ప్రేమ ఎన్నో రెట్లు పెద్దది అని స్వయముగా గ్రహించినాను. దీనినిబట్టి సేవ చేయుటకు అన్ని వేళలా సర్వసిద్ధంగా వుండాలి అని గ్రహించినాను. అటువంటి సేవ అవకాశం రెండవసారి వచ్చింది. ఆ ఆనందాన్ని ప్రశాంతంగా అనుభవించాను. నా చేతి రుమాల నా ప్రక్కన ఉన్న స్త్రీకి అందిచ్చాను. ఆమె పరమా నందం పొందింది. తరువాత ఇటాలియన్ స్త్రీకి యిచ్చాను. ఎక్కడ సేవ వుంటుందో, అక్కడ త్యాగం వుంటుందని గ్రహించాను.

7) భజన ప్రియుడు :

భగవంతుని నామ రూప మాధుర్యములను అనుభవించు, ధ్యానమునకు కూర్చొనినపుడు, భగవంతుని గొప్పదనమును గురించి కొన్ని శ్లోకములు మొదట వర్ణించు. నలుమూలల చెదిరియున్న భావ మపుడు, భగవంతునియందు కేంద్రీకరణమై నిలుపుకొనుము. మధ్యలో మనస్సు అటు, ఇటు చలించినప్పడు, రూపము నకు సంబంధించిన చిత్రముపై నుండి, మనస్సు చలించిన నామమును ధ్యానించు. ఈ విధముగా నామము యొక్క కాని, రూపము యొక్క కాని, మాధుర్యం అనుభవించు. ఈ విధముగా మానసిక శిక్షణ పొంది, క్రమేణా నీ మనసులోని ఊహా చిత్రము, భావ చిత్రముగా రూపొంది, నీ మనస్సులో స్థిరపడును, నీ పిలుపు నాలకించి, నిన్ను అనుగ్రహించుటకు భగవంతుడు వచ్చిన, అది "సాక్షాత్కర" చిత్రముగా మారును. ఈ సాధనకే, జప సహిత ధ్యానమందురు. ఆధ్యాత్మిక సాధనలోని, ప్రారంభికులకు నేనీ పద్ధతినే చెప్పచున్నాను. ఇదే ఉత్తమ పద్ధతి.

దివ్యభజన: హరే మురారి, సాయిరాం । హరే మురారి శ్యాం ॥
పరమ సుమంగళ సాయిరాం । పరమ సుమంగళ శ్యాం ॥ ॥హ॥
అల్లా ఈశ్వర సాయిరాం । అల్లా ఈశ్వర శ్యాం ॥
పరమ సుమంగళ సాయిరాం పరమ సుమంగళ శ్యాం ॥ ॥హ॥

8) వేదాంతవేద్యుడు - మైత్రేయోపనిషత్తు (3వ అధ్యాయం)

ఉ॥మం॥ శూన్యా శూన్యభావోస్మి । శోభనా శోభనోస్మహమ్ ॥
శుభోస్మి వోకహీనోస్మి । చైతన్యోస్మి నమోస్మ్యహమ్ ॥

తా॥ శూన్యా శూన్య మహిమన బడసినవాడుగా నున్నాను. శోభనా శోభనుడుగా నున్నాను. దుఃఖములేని వాడుగా యున్నాను. చైతన్యంగా (జ్ఞానముగా, ప్రేరేపించు వాడుగ, ఆత్మగా, సాక్షిగా) నున్నాను.

ఉ॥మం॥ తుల్యా తుల్య విహీనోస్మి । నిత్య శుద్ధ సదాశివ ॥
సర్వా సర్వ హీనోస్మి । ద్వి సంఖ్యా వానహం నచ ॥

తా॥ సమముగా నున్నాను. సమమైనది గలిగిన వాడుగను, సమమైనది లేనివాడుగను, నిత్యుడుగను, శుద్ధుడగను, సదాశివుడుగను నున్నాను. సాత్వికుడిగా నున్నాను, ఎల్లప్పడు ఉన్నాను. లేని వాడుగనున్నాను. సాత్వికుడిగా నున్నాను, ఎల్లప్పడు వున్నాను.

ఉ॥మ॥ ఏకసంఖ్యా విహీనోస్మి । సాత్వికోస్మి సదాస్మహమ్ ।
సద సద్భేదహీనోస్మి । సంకల్పరహితోస్మహమ్ ॥

తా॥ ఒకటి అను సంఖ్య లేనివాడుగ నున్నాను. రెండవ సంఖ్య లేనివాడుగా నున్నాను. సత్తు, అసత్తు, అను

భేదము లేనివాడుగ నున్నాను. సాత్వికుడిగా యున్నాను. ఎల్లప్పడు వుంటూ వున్నాను. సంకల్పములు లేని వాడుగా నున్నాను.

## ఓం తత్సత్